

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 4 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పిండారీలు!

కన్నుమూసి తెరిచేలోగా గ్రామమధ్య స్థలానికి చేరుకున్నాడు రాయలు. తీవ్రమైన ఆర్తనాదాలు, అగ్నిజ్వాలలలో దగ్ధమౌతున్న గుడిసెలు చెట్లు వెలువరిస్తున్న ఫెళఫెళార్భాటాలు చెలరేగుతున్నాయి. ఏమి చేయాలో తోచని ఆందోళనలో కకావికలై పరుగులు పెడుతున్నారు గ్రామస్తులు. కంసుడి సేనల్లా రెచ్చిపోతున్నారు ముదురు వంగపండు రంగులో, వంపులు తిరిగిన ఇనుప చువ్వలవంటి శరీరాకృతి కలిగిన దుర్మార్గులు. కంటెలు, కడియాలు, వంకీలు బిరుసైన తలపాగాలు ధరించారు. బరిసెలు పట్టుకుని కొందరు గుర్రములమీద, కొందరు పరుగులు పెడుతూ, చెట్టూ పుట్టకు పారిపోజూస్తున్న గ్రామస్తులను తరుముతున్నారు. ఉండీ లేనట్టున్న గుడిసెల తలుపులను కూలదన్నుతున్న గుర్రాలు, ముష్కరుల మూకలు. పసిపిల్లలను హత్తుకుని

పారిపోజూస్తున్న స్త్రీమూర్తులు. చేతులెత్తి నమస్కరిస్తూ వణికిపోతున్న వృద్ధులు. వస్తూనే అల్లంత దూరమునుండి భీతావహమైన దృశ్యపరంపరను చూశాడు రాయలు.

బరిసెను ఎత్తి తన గుర్రానికి ఎదురొచ్చిన వాడిని ఆయన గుర్రాన్ని ప్రక్కకు గెంతించి కాచుకున్నాడు. కుడికాలితో తన్నిన తన్నుకు వాడి కనులు బైర్లు కమ్మి పోతుండగా వాడి చేతిలోని బరిసెను లాక్కున్నాడు. దానితోనే వాడి కుడిగూడను పైనుండి క్రిందికి చీరేశాడు. గూడలవరకూ ధరించిన వాడి గోధుమరంగు జుబ్బా నెత్తుటితో ఎర్రముద్ద అయ్యింది. వాడు నేలకూలుతుండగా రచ్చబండపై ఒక స్త్రీ గుండెలమీద చెయ్యేసి నెడుతూ చంకనున్న పసికందును లాగుతున్న వాడు కనిపించాడు. అంతకుముందే స్వాధీనమైన బరిసె ఒక మెరుపు మెరిసింది. శ్రావణ మాసపు పెను తుఫానులో సుడిగాలి అడవి వెదుళ్ళలో దూరితే వచ్చే ఝుమ్మనే నాదం ఒక నాడీస్పందన కాలమాత్రం వినిపించింది. గాలిలో కంటికి కనిపించకుండా దూసుకెళ్ళింది బరిసె. వాడి నడుములో దిగబడి, పొత్తికడుపును చీల్చుకువచ్చిన దాని మొన వాడి నెత్తుటితో మెరిస్తూ అప్పుడు కనిపించింది!

ఈ సరికి ఉరుకులు పరుగులమీద కృష్ణరాయల బృందం వచ్చి పడింది. ఎదురైనవాడిని ఎదురైనచోటనే నేలకూల్చడమో, వారిస్తూ పెనుగులాడడమో ప్రారంభము ఐంది. కొద్ది నిముషాలకు తమకు ప్రతిఘటన ఎదురవుతున్నది అని తెలుసుకున్న దోపిడీ మూక వారి భాషలో అరుపులూ కేకలూ విచిత్రమైన ఈలలూ వేయడం, దాడికి వచ్చిన వారందరూ వీరిమీద దృష్టి కేంద్రీకరించి కమ్ముకోడం మొదలైంది. దోపిడీగాళ్ళను చూసిన దగ్గరినుండీ ఒకప్రక్క రెండు చేతులలో రెండు ఆయుధాలతో చండవిహారం చేస్తూనే ఒక వ్యక్తి కోసం వెదుకుతున్నాయి కృష్ణరాయలకళ్ళు.

ఆయన వెతుకుతున్న ఆకారం కంటపడగానే అంతవరకూ నోటితో బిగించిపట్టుకున్న కళ్ళాలను వదిలి, స్వచ్ఛమైన మరాఠీలో అడిగాడు 'నువ్వేనా దళ నాయకుడివి' అని. అంతటి చెవులు పగిలిపోయే అరుపులూ కేకలు ధ్వనులమధ్య కూడా భేరీ నాదంలాగా వినిపించింది ఆ కంఠధ్వని. రచ్చబండకు దక్షిణంగా ఉన్న గుడిసెల మధ్యనుండి గుర్రాన్ని దూకిస్తూ వచ్చిన ఒక ఆకారం లిప్తపాటు నివ్వెరపోయింది. ఎర్రని జుబ్బా ధరించి పోతపోసిన ఇనపముక్కలా ఉన్నాడు వాడు. దండచేతికీ, నడుముకూ చిరుఘంటలు కుట్టిన నెమలీకల దండలు, ఎర్రని తలపాగా ధరించి ఉన్నాడు, వాడే ఆ దోపిడీ దళ నాయకుడు అని చెప్పడానికి గుర్తుగా.

ఎర్రని భవానీ దీక్షా వస్త్రములో ఉన్నాడు కృష్ణరాయలు. ఒకచేతిలో బరిసె మరొక చేతిలో అప్పుడే ఒకడి దగ్గర పోరాటంలో స్వాధీనం చేసుకున్న గండ్రగొడ్డలిని ఉన్నాయి. రెండు ఆయుధాలూ బొట్లు బొట్లుగా చిక్కని నెత్తురు ఒడుస్తున్నాయి. ముఖాన పట్టిన ముచ్చెమటల తడికి కొద్దిగా కారిన అమ్మవారి సిందూరం ఆయన ముఖంలో ప్రతిఫలిస్తున్న తీవ్రమైన కోపపు ఎర్రదనంతో పోటీచేస్తున్నది. తెల్లనిగుర్రం మీద తేజస్సుతో కళ్ళెర్ర జేసిన కల్కిలా ఉన్నాడు. చుట్టూ రగులుతున్న మంటల్లో దక్షయజ్ఞ వేదికపై రెండవ వీరభద్రుడిలా ఉన్నాడు. దండయాత్రకు బయలుదేరిన రెండవ శివాజీలా ఉన్నాడు. కుడిచేతిలో వంకీ కత్తిని పైకెత్తి గుర్రాన్ని దూకిస్తూ వస్తూ కృష్ణరాయల ప్రశ్నను విన్నాడు వాడు, దగ్గరికి వచ్చి రూపాన్ని చూశాడు, మరుక్షణం

'శివాజీసేన వచ్చింది, పారిపోండి' అని మరాఠీలో అరుస్తూ కన్నుమూసి తెరిచేలోగా గుర్రాన్ని గిర్రున త్రిప్పి ముందుకు దూకించాడు పారిపోవడానికి.

కొద్దిగా ఊహించని పరిణామముతో లిప్తపాటు ఆలస్యముగా స్పందించిన కృష్ణరాయలు తన గుర్రాన్ని ముందుకు దూకించాడు వాడిని వెన్నంటి పట్టుకోడానికి. వాడు ఆ సరికే ఐదు ధనువుల దూరం వెళ్ళిపోయాడు. తన గుర్రాన్ని ముందుకు దూకిస్తూ దూరాన్ని అంచనా వేస్తూ ధనుస్సు ఆకారంలో పూర్తిగా పైకి లేపాడు తన కుడిచేతిని. విసిరిన బరిసె ముందు పరుగెడుతున్న గుర్రం తొంటిని చీల్చుకుని ముందుకు తేలింది.

మూడు పల్టీలు కొట్టి తలక్రిందులై బాధగా చేస్తున్న దాని సకిలింపులు మిన్నంటాయి. ఆ రౌతు ఆ ఉదుటుకు వడిసెలనుండి వదిలిన రాయిలాగా గాలిలో తేలుతూ వెళ్ళి ప్రక్కనున్న పొదలమీద పడిపోయాడు. పొదలను విరగదొక్కుతున్న దున్నపోతులాగా పొర్లుతూ పల్లంలోకి జారిపోయాడు.

కొద్దిసేపు కనులు బైర్లు కమ్మి అయోమయంగా ఉన్నవాడు తేరుకుని లేచేలోపు బలిష్ఠమైన కృష్ణరాయలపాదము వాడిని పైకి లేవకుండా గుండెలమీద తొక్కిపట్టింది.

పడగను విసిరే అవకాశంకోసం ఎదురుజూస్తున్న పగగొన్న త్రాచులా చూపులకు చూపులు కలుపుతూ చూస్తుండిపోయాడు వాడు. నేలమీదినుండి లేవడానికి విఫల ప్రయత్నము చేశాడు. వాడి గుండెమీద తొక్కిపట్టిన మోకాలిమీదికి మోచేతిమీద వంగాడు కృష్ణరాయలు. గొడ్డలి అంచును వాడి గడ్డానికి ఆనించి, కళ్ళల్లోకి చూస్తూ స్వచ్ఛమైన మరాఠీలో ప్రశ్నించాడు.

'ఎన్ని దళాలు దాడికి బయల్దేరాయి?'

'తెలియదు'

'ఎక్కడెక్కడ దాడికి బయల్దేరారు?'

'తెలియదు'

'నువ్వు దళ నాయకుడివి కదూ?' మౌనం.

'సమర్థరాముడి దాసుడిని నేను. ఛత్రపతి సైనికుడిని. మాట ఇస్తే తప్పను. జవాబు చెప్పు, నిన్ను వదిలిపెడతాను'

కొన్ని క్షణాలు క్రోధంగా, మౌనంగా చూసి, మనసు మార్చుకున్నవాడిలా నిట్టూర్చి, మోచేతులమీద పైకి లేవడానికి ప్రయత్నించాడు వాడు. దారికి వస్తున్నాడు అని కొద్దిగా పొరపాటుపడి, వాడి గుండెమీది కాలును తీశాడు రాయలు. వాడు మోచేతులమీద నడుములదాకా పైకి లేచాడు. ఎడమ చేత్తో తన గడ్డానికి ఆనించి ఉంచిన గొడ్డలిని నెమ్మదిగా ప్రక్కకు నెట్టాడు. అంతే! కుడి దండచేతికి కట్టి ఉంచిన చిన్న సంచీలాంటి గుడ్డముక్కను నాలుకతో కొరకడం, అందులో ఉన్న ముల్లులాంటిది వాడి నాలుకలో దిగి, ఒకే ఒకబొట్టు రక్తం చిమ్మడం రెప్పపాటులో జరిగిపోయాయి. ఒక్క ఉదుటున వాడిని వారించబోయి తమాయించుకుని ఆగిపోయాడు రాయలు.

వాడు పిండారీ! శత్రువును చంపడమో, వాడు చావడమో రెండే తెలుసు ఆ జాతికి. అడవుల్లో తిరిగే నల్లత్రాచు కోర కుడి భుజానికి జాగ్రత్తగా కట్టుకుని, కులదేవతకు దున్నపోతును మెడ సగం నరికి బలిఇచ్చి, అది ప్రాణాలు వదిలేలోగా పొలిమేరలు వదిలి దాడికి వెళ్తారు. ఓటమి జరిగి, పట్టుబడితే ఆ విషపు కోరను కొరికి ప్రాణాలు విడుస్తారు. నల్లత్రాచు విషపు కోర ఎంతకాలమైనా విషయుతంగానే ఉంటుంది. అది ఒంట్లో దిగబడి, ఆ విషం రక్తంలోకి జొరబడడం అంటూ జరిగితే ఏ విరుగుడూ ఉండదు, ప్రాణాలు విడవడమే ఉంటుంది. రెండే రెండు నిముషాలలో వాడి శరీరం కాటుక పూసినట్టు నల్లబడింది. నోటివెంట కొద్దిగా నీలిరంగు కలిసిన తెల్లని నురగలు వచ్చాయి. కనుగుడ్లు తిరిగిపోయాయి. వాడి ప్రాణాలు పోయాయి. ఆ సరికి అక్కడికి చేరుకున్న కృష్ణరాయల అనుచరులు, మొండిగా పిండారీలను ఎదిరించడానికి ధైర్యంగా ముందుకొచ్చిన కొంతమంది యువకులు విస్మయంగా చూస్తుండిపోయారు.

మధ్యభారత అరణ్యాలలో కార్చిచ్చులాగా పుట్టి దారికి అడ్డు వచ్చిన వారిని నిర్దాక్షిణ్యంగా కాలరాస్తూ దోపిడీలు సాగించి జీవించే ఆటవిక గిరిజన జాతివాళ్ళు పిండారీలు. ఒక దశలో కేవలం మధ్య భారతమే కాక ఉత్తర దక్షిణ భారతంలోని రాజ్యాలూ, జనపదాలు కూడా వాళ్ళ ధాటికి విలవిలలాడిపోయాయి. కొమ్ములుతిరిగిన చక్రవర్తులకు, లక్షల వీర సైనికులకు కూడా కొరుకుడుపడని వాళ్ళను ఛత్రపతి శివాజీ శౌర్యశక్తి, ఆయన గురువు

సమర్థ రామదాసు మేథో బలము ఏకమై అణచివేశాయి. శివాజీ మహారాజు నిర్దాక్షిణ్యంగా వారిని ఊచకోతకోసి దారికి తెచ్చాడు. కొందరు లొంగిపోయారు. కొందరు పారిపోయారు. కొందరు విధేయులుగా మారిపోయారు. శివాజీ మహారాజు అనుచరులు కంటబడిన చోట వెనక్కు తగ్గి పారిపోవడం వారికి అలవాటైపోయింది. అలా పారిపోవడానికి ప్రయత్నించాడు వీడు. అది సాధ్యం కాక, పట్టుబడి లొంగిపోవడం ఇష్టం లేక ప్రాణాలు

వదిలాడు. తుప్పలూ, చెట్ల కొమ్మలూ పేర్పించి, వాడి శరీరాన్ని 'ఆ విషపు కోరతో కలిపి' బూడిద కుప్పగా మారేవరకూ కాల్పించి, వెనక్కు మళ్లాడు కృష్ణరాయలు.

అంతవరకూ పురాణ గాథను చెప్పుకుంటున్నట్టు మరొకసారి పిండారీల దాడి, కృష్ణరాయల పరాక్రమాల గురించి అబ్బురంగా ముచ్చటించుకుంటున్నారు గ్రామస్థులు. ఇంతలో మూటగట్టిన సూర్యుడి తేజస్సులాగా, చుక్కలమధ్య వెలిగిపోతున్న పున్నమిచంద్రుడిలా, ఋషుల మధ్యలో శుకమహర్షిలాగా, వినయంగా తనను అనుసరిస్తున్న అనుచరులతో అక్కడికి వచ్చాడు ఒక దివ్య సుందర పురుషుడు.

ఊరంత పెరిగిన వేపచెట్టు నీడలో, ఆవుపేడతో అలికిన ఎత్తైన మట్టిఅరుగుమీద చేరి కృష్ణరాయల కథను చెప్పుకుంటున్నవారి ముందు నిలిచాడు. అసంకిల్పితంగా వ్యక్తమవుతున్న గౌరవభావముతో మంత్రముగ్ధులై నమస్కరిస్తూ అరుగు దిగారు అందరూ. ముద్దులు మూటగడుతున్న ముఖంలో సన్నని దరహాసపు వెన్నెల కురిపిస్తూ మంద్రస్వరంలో, మధుర స్వరంలో, మనసులు వశంతప్పి మనుషులు దాసులయ్యే మంత్రసాధకుడిలా 'ఉద్దవా!' అని నెమ్మదిగా పిలిచాడు.

'స్వామీ!' అంటూ ఆయన వెంట ఉన్నవాళ్ళలోకాల్చిన మెరుపుతీగలాగా, నచికేతునిలాగా మెరిసిపోతున్న ఒక నవయువకుడు అడుగు ముందుకేశాడు. అరుగుమీద కూర్చున్న వాళ్ళను చూస్తూ ' కృష్ణరాయలవారి  మహల్ యిదే కదూ?' అని అడిగాడు. నోరుతెరిచి సమాధానం కూడా చెప్పలేని వారిలాగా 'అవును' అన్నట్లు తలలూపి, గభాలున ముందుకు దూకారు వారు. పరుగెత్తుతున్నట్లుగా వెళ్లి, కోటతలుపులలాగా ఉన్న విశాలమైన, దృఢమైన తలుపులను తడుతూ పిలిచారు. 'జై శ్రీరామ్' అని ఉచ్చస్వరంతో నినాదం చేస్తూ అడుగుముందుకేశాడు దివ్యపురుషునిలా ఉన్న ఆ మహానుభావుడు.

## – 5 –

శ్రీరామ జయరామ జయజయరామ!

మహారాష్ట్ర అడవులలో తిరిగే మదపుటేనుగు దంతాలతో చేసిన ఆసనం మీద  కూర్చుని ఉన్నాడు కృష్ణరాయలు. ఒక చేయి చుబుకం క్రింద, మరొకచేయి మదపుటేనుగు తొండంలాగా ఉన్న తొడపై చేర్చి రెండు రోజులక్రితం ఎదురైన ఆశ్చర్యకరమైన అనుభవంగురించే ఆలోచిస్తున్నాడు.

ఏదో అంతుబట్టని మానవాతీతమైన శక్తి ఆ సంఘటనవెనుక ఉన్నది అనిపిస్తున్నది ఆయనకు. అంతలోనే అదేమీ కాదు అనిపిస్తున్నది, మహా సర్పాలఉనికి గురించి దట్టమైన అరణ్యాలలో తిరగడం తెలిసిన ఆయనకు తెలియనిది ఏమీ కాదు. కానీ ఇంత పెను పరిమాణములో ఉన్న కాలసర్పము ఎదురవడం యిదే ప్రథమం. అంతకన్నా ఆయన ఆలోచిస్తున్నది అది 'పగగొన్న దానిలాగా' తనగురించే 'వేచి వున్నదానిలాగా' తననే లక్ష్యంగా చేసుకుని అంతం చేయడానికి ప్రయత్నించడం ఎందువలన అన్న ప్రశ్నతో! అంతకుముందు ఎన్నడూ చూసి ఎరుగని ఆ భయంకర సర్పానికి తను ఏమి కీడు చేయడానికి ప్రయత్నించాడు కనుక, అది తన మీద పగబట్టడానికి?

తన తండ్రి ఛత్రపతి పాలెగాడుగా ఆ పరగణాకు వచ్చినప్పుడు మామిడితోపు మధ్యలో బస చేసుకొనడానికి చదును చేస్తున్నపుడు ఆ తోటలో నైరుతిమూలలో చెట్టుకింద ఉన్న పెద్దపుట్టను చాలా సున్నితంగా తొలిగించినప్పుడు బయటకొచ్చి పడగవిప్పి బుసలుకొట్టిన  జమిలి త్రాచులు గుర్తుకొచ్చాయి ఆయనకు. ఎంత సొగసుగా ఉన్నాయని! ఒళ్ళు జలదరించే భయముతోపాటు మెచ్చుకోలును కలిగించే అందం వాటిది. మధ్యాహ్నపు ఎండలో అమ్మవారి పట్టుచీర అంచులా తళతళ మెరిసిపోతూ ముదురు గోధుమ రంగులో ఊగిపోతూ కనిపించాయి. రెండుచేతులూ ఎత్తి నమస్కరించి ' మీకేమీ ద్రోహం తలపెట్టడంలేదు, వేరే ఎక్కడికైనా వెళ్లి మీ నివాసం ఏర్పరచుకోండి' అని తన తల్లిదండ్రులు అనగానే తెరచాపల్లా ఊగుతున్న పడగలను

నిలిపి, ఒక్క నిముషం బుసలుకొడుతూ చూసి, చటుక్కున పడగలు దించుకుని వెళ్ళిపోయాయి కదా! మరి ఈ భయంకర సర్పము ఎందుకిలా వెంటబడ్డది? దాని కళ్ళలో 'నీ అంతు చూస్తాను' అని పలుకుతున్నట్లుగా కనిపించిన క్రోధపు మెరుపు వదలకుండా గుర్తుకొచ్చినప్పుడల్లా యిది యాదృచ్ఛికంగా జరిగినది కాదు, ఏదో కారణం ఉన్నది అనుకోకుండా ఉండలేకపోతున్నాడు ఆయన.

ఇంతలో గుమ్మం వద్ద తడుతున్నట్టు పిలుస్తున్నట్టు ధ్వని వినిపించింది. ఆయన అంగరక్షకులు ద్వారం వద్దకు వెళ్ళడం చూస్తున్న ఆయనకు ' జై శ్రీరామ్' అనే నినాదం వినిపించింది. ఒళ్ళు జలదరించింది. యుగాలపర్యంతం ఆ నామాన్ని ఉచ్ఛరించిన గొంతులా వినిపించింది. ఆ పవిత్రతలో మునకలేసిన పవనతనయుడి గొంతులాగా వినిపించింది.

తన అదృష్టవశాత్తూ తనలాంటి అనేకులూ, అనేకులైన పాలెగాళ్ళూ, సర్దారులూ తుల్జాపూరు భవానీ ఉత్సవాలలో ఒకసారి, 'ప్రతాప్ గడ్' మహాబలిజయంతి ఉత్సవాలలో ఒకసారి దూరంనుండి చూసిన మహానుభావుని రూపం గుర్తుకొచ్చింది.

అంతకుముందు వినిపించిన నినాదంతో రేగిన శబ్దతరంగాలకు ఆయన మనసులో స్ఫురించిన దివ్యరూపం విరజిమ్మిన కాంతితరంగాలు తోడైనాయి. వెన్నుపూస క్రిందినుండీ మెదడులో నరాలవరకూ విద్యుత్ తరంగాలు వ్యాపించిన అనుభూతి కలిగింది. లిప్తలో నూరవవంతు మత్తులా అనిపించింది, శరీరం నిలువెల్లా చలించిపోయింది. అటూ యిటూ ఉన్నసేవకులు అనుసరిస్తుండగా, పీఠం మీదినుండి లేవడం, పాలరాయి పరచిన ఎత్తైన ఏడు మెట్లను దిగడం, పరుగున ద్వారంవద్దకు చేరుకోవడం కలలో జరిగినట్లుగా అనిపిస్తుండగా, తెరిచిన ద్వారములోనుండి కనిపించాడు ఆ మహానుభావుడు!

ఆయన కాషాయాంబరాలలో కల్కిలా ఉన్నాడు. తాబేటిచిప్పలా పొంగిన ఎడమభుజానికి వ్రేలాడుతున్న వింటినారి మంచిగంధపుచెట్టుకు అల్లుకున్న మల్లెలతీగలా ఉంది. ఎడమచేత ధనువును పట్టి, రాముడిలా ఉన్నాడు. కుడిచేతిలో దండకమండలాలతో, గుండెమీదకు వ్రేలాడుతున్న గడ్డంతో 'ఆయన' కులగురువులా ఉన్నాడు. జై శ్రీ రామ్ అని పలుకుతున్నప్పుడు తన్మయత్వంతో మెరుస్తున్న కించిత్తు నీలి కనులతో, విప్రునివేషంలో వివరం తెలుసుకోడానికి వచ్చిన వీరహనుమలా ఉన్నాడు. బ్రహ్మతేజము, క్షాత్రతేజము కలిసిపోయి దక్షిణామూర్తి, శ్రీరామచంద్రమూర్తి ఏకమైపోయిన వాడిలా ఉన్నాడు. ఎడమ కుడిగా సూర్యుడు చంద్రుడు ఏకమైపోయి, చంద్రనిప్పులు పండువెన్నెలా కలిసి కదిలి వచ్చినట్లున్నాడు. ఆ ఘటనాఘటన సమర్థుడు సమర్థరాముడు! ఆయన శివాజీని ఛత్రపతిని చేసిన సమర్థ రామదాసు!

శ్రీరాముడిని చూసిన గుహుడైనాడు, శ్రీకృష్ణుడిని చూసిన కుచేలుడైనాడు కృష్ణరాయలు. ఆయన పాదాలచెంత వాలిపోయాడు అమాంతం. కనులవెంట జారుతున్న ఆనందబాష్పాలు ముత్యాలు కుట్టిన అంగరఖాను తడిపేస్తున్న సంగతి గమనించలేదు. కంపించిపోతున్న చేతులను జోడించి ఆ మహానుభావుని ప్రసన్నవదనంలోకే చూస్తుండిపోయాడు. గుమికూడిన కొద్దిమంది గ్రామస్థులు, రాయల అనుచర, అంగరక్షక గణం వసంతపూర్ణిమ ప్రభాతవేళలో ధరిత్రిమీద రాలిన సన్నజాజుల్లాగా నేలమీదికి సాష్టాంగంగా వ్రాలిపోయారు.

పరిచారికల ద్వారా విషయము తెలిసినట్టుంది, అష్టసిద్ధులు వెన్నంటి వస్తున్న ఆదిలక్ష్మిలా పరిచారికలతో లోపలినుండి పరుగున వచ్చింది లక్ష్మీబాయి. తలమీదుగా మేలిముసుగును సవరించుకుంటూ, చిన్ని వెండి బిందెలో తనే పరిశుభ్రమైన నీటిని మోసుకొచ్చింది. భర్తచేతులమీదుగా జలధారతో వెండి పళ్ళెరంలో ఆయన పాదములను కడిగింది. భర్తతోపాటు తనూ ఆ జలమును శిరసుమీద చల్లుకుని, భర్తకు తోడుగా ఆయనకు మోకరిల్లింది. వనవాసంలో రాముడేతెంచిన మతంగుని ఆశ్రమం ఐంది రాయల మహల్. వనవాసం నుండి రాముడు తిరిగొచ్చిన అయోధ్య ఐపోయింది రాయల ప్రాంగణం. తనచుట్టూ మోకరిల్లిన వారిని కలయచూశాడు సమర్థరాముడు. గోకుల బృందావనంలోని గోవులను, దూడలను ప్రేమగా పరికిస్తున్న శ్రీకృష్ణునిలా పరికిస్తూ చుట్టూ చూశాడు.

చుట్టూ పది అడుగుల ఎత్తున దృఢమైన ప్రహరీ గోడతో మూడెకరాలలో పరుచుకున్న దేవిడీ అది. నాలుగుమూలలలో చిన్న బురుజులు శిఖరాలనెత్తి చూస్తున్న చిన్న పర్వతాలలాగా ఉన్నాయి. బురుజులకున్న ఎఱ్ఱని జెండాలు శివునితోకలిసి తాండవం చేస్తున్న పార్వతీదేవి పైట చెంగులా గాలికి కదలాడుతున్నాయి. ఆ చిరుధ్వజాలకు కుట్టిన చిరుమువ్వలు నృత్య ప్రదర్శనకు సిద్ధమవుతున్న నర్తకీమణులు సవరించుకుంటున్న కాలి అందెలలాగా ఉన్నాయి. చక్కిలిగింతలను రేపే సన్నని సడులను చెవులకు విందు జేస్తున్నాయి.

అల్లంత దూరంలో ఒకప్రక్కన అశ్వశాల, కొంత ఎడంగా గోశాల, ఆ వెనుక కనిపిస్తున్న విశాలమైన వనము. నానాజాతుల ఫల, పుష్ప, తరువులకు నెలవై నయనమనోహరంగా ఉంది. తన ఎడమప్రక్కన దివ్యమైన పరిమళముల పరంపరతో గాలిని పరిశుద్ధము చేస్తున్న తులసీ బృందావనము ఉన్నది. పదిమంది దృఢకాయులు ఒకేసారి ప్రవేశించగలిగినంత విశాలమైన నగిషీలు చెక్కిన సింహద్వారానికి అభిముఖంగా ఉన్నది అది. ఒక మూలన అంగరక్షకుల, పరిచారకుల నివాస సముదాయము కనిపిస్తున్నది. జనావాసాలు, పశువాసాలు, వనము, బృందావనము ఎక్కడికక్కడ దృఢమైన వెదురు కంచెలతో విభజింపబడి ఉన్నాయి. చలువరాళ్ళు పరచిన కాలిబాటలు మినహా నేల అంతా ఆవుపేడతో అలుకబడి, తెల్లని ముగ్గులతో తీర్చి దిద్దబడి, ముత్యాల పేరులతో ముసి ముసి నవ్వులు చిందుతున్న పెద్ద ముత్తైదువులా ఉంది. అక్కడక్కడ చల్లని నీడనిచ్చే పెద్ద పెద్ద చెట్లకు చుట్టూ కట్టిన అరుగులున్నాయి. ప్రాంగణం మధ్యలో తెల్లని మూడుఅంతస్తుల మిద్దె కంఠం పైకెత్తి చూస్తున్న కైలాస శిఖరంలా ఉన్నది. వినయమున్న విద్వాంసుడిలా ఉన్నది. దయను కలిగిన శూరుడిలా ఉన్నది. నిరాడంబరుడైన సంపన్నుడిలా ఉన్నది. మత్సరాన్నికూడా జయించిన మహర్షిలా ఉన్నది!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS